# ముగింపు!

సుందర్రామయ్య గారంటే ఆ కాలనీలో పరువుగా బతుకున్న పెద్దమనిషని అందరికీ తెలుసు.

అటువంటి ఆయన ఇంటి ముందు పోలీసుజీపు ఆగటమేమిటని వీధిలో వారందరూ ఆశ్చర్య పోయారు.

చేతులకు బేడీలు వేసి సుందర్రామయ్యను పోలీసు జీపు ఎక్కిస్తుంటే... గుమికూడిన ఇరుగు పొరుగు వారందరు 'ఎలాంటి పెద్దమనిషికి ఎంతటి ఖర్మ పట్టిందీ' అని ముక్కున వేలేసుకున్నారు.

జీపు ముందుకు సాగి పోవటంతో ఆ ఇంటి తలుపులు మూసుకున్నాయ్.

ఎవరికి తోచిన విధంగా వారనుకుంటు చెవులు కొరుక్కున్నారేగానీ... అసలేం జరిగిందో.. ఇంట్లో కుటుంబ సభ్యులకు తప్ప... బైటవారెవరికీ తెలియదు.

సుందర్రామయ్య ముక్కుసూటి మనిషి! డొంకతిరుగుడు వ్యవహారాలు ఆయనకు నచ్చవు!

ఏ సలహా కావాలన్నా... సాయం కావాలన్నా...ఆ కాలనీ వాసులు సుందర్రామయ్యను ఆశ్రయిస్తారు. మనిషి మంచి వ్యవహారవేత్త! ఎంతటి జటిల సమస్యనైనా పోలీస్టేషను... కోర్టుల దాకా వెళ్లనీయకుండా తెలివిగా తానే పరిష్కరించగల బుర్ర ఆయనిది!

'లా' చదవక పోయినా... చట్టం గురించి తెలియకపోయినా.. తాను స్వయంగా వకీలు కాకపోయినా ఎలాంటి వ్యావహారంలోనైనా... ఆయనిచ్చే తీర్పు న్యాయసమ్మతంగా వుందనే వాస్తవం అందరూ ఎరిగినదే! అందుకే ఆయన తీర్పు అందరికీ శిరోధార్యం!

సుందర్రామయ్య ఇల్లే ఒకచేరి! ప్రతి రోజూ సాయం సంధ్యవేళ పదిమంది వయసు మళ్లిన వారు ఆయన పంచలో చేరతారు. పిచ్చాపాటి వ్యవహారాలు ముచ్చటించుకుంటూ వుంటారు.

ఆరడుగుల ఎత్తు మనిషి సుందర్రామయ్య! దృఢమైన ఆకారం... బుంగ మీసాలు... విశాల ఫాలభాగం... గుండ్రని పెద్దకళ్లు.. మెడలో రుద్రాక్షమాల... దాని నడుమ భుజాన వేలాడే యజ్ఞోపవీతం... నుదుటిన విభూతిపట్టెలు.. మిలమిలా మెరిసే చేతి వేళ్ల కున్న బంగారు వుంగరాలు... మనిషి దర్జాగ ఠీవిగా వుండే ఆయనను చూచిన ఎవరికైనా చేతులెత్తి నమస్కరించాలన్పిస్తుంది.

మనిషిలో దైవత్వం పుట్టిపడుతూంటుంది. మనిషి మృదుభాషి! సాంప్రదాయాలను.... ఆచార వ్యవహారాలను పాటించే వ్యక్తి! వాక్శుద్ధిగలవాడు.

సుందర్రామయ్య చిద్విలాసంగా నవ్వినపుడు... కింది పలువరుసలో వుండే రెండు

బంగారపు పళ్లు తళతళా మెరుస్తూంటే.. వారిలో అదొక ప్రత్యేక ఆకర్షణ అన్పిస్తూంటుంది!

ఆయన బంగారు పళ్లను పదే పదే చూచి మురిసిపోవాలనుకునే వారంతా జోకులేసి నవ్విస్తూండటం పరిపాటి!

సుందర్రామయ్య స్థితిపరుడు! వారసత్వ సంపదగా.... పాతికెకరాల మాగాణి... చెఱకు తోట... కొబ్బరి తోపు... వారి స్వగ్రామంలో వున్నయ్.... వెండి బంగారం ఎంతుందో మాటల్లో చెప్పటం కష్టం! నాలుగైదు బ్యాంకుల్లో లక్షల క్యాష్ మూలుగుతూంటుంది.

ఎవరికే కష్టమొచ్చినా ఆదుకునే దయార్ద్రహృదయుడు. అవసరాలకు అప్పుపుచ్చుకుని ఆయన బాకీ తీర్చకుండా పంగనామం పెట్టిన వారు కోకొల్లలు. ఎవరెవరు ఎంత ఎగేసినా ఆయనకు చింతలేదు.

అరవయ్యో ఏట... అర్ధాంగి ఆకస్మికంగా కన్నుమూసినా... ద్వితీయ వివాహం చేసుకోమని బంధువర్గమంతా చెవిలోజోరీగల్లాగా సోదపెట్టినా... ససేమిరా వద్దన్నాడు. సహధర్మచారిణి తీపిజ్ఞాపకాలతో తన శేషజీవితాన్ని ఒంటరిగా గడిపేటందుకే నిర్ణయించుకున్నాడాయన.

ఎనభయ్యో వడిలో కూడా... ముప్పొద్దులా వెండి కంచంలో కడుపునిండా భోజనం చేసి తిన్నది హరాయించుకోగల శక్తివున్న ఆరోగ్యవంతుడు! ఇన్నేళ్ల జీవితంలో జ్వరంగాని... తలనొప్పి గాని ఎరుగడు! వైద్యుడు ఆయన ఇంటి గుమ్మం తొక్కలేదంటే... నమ్మశక్యంగాని విషయం!

ఇప్పటికీ తను కాఫీ... టీ... వంటివి తాగడు! పండుగ నాడు తాంబూలమైనా సేవించడు!

సుందర్రామయ్యకు ఇద్దరు మగ సంతానం! పెద్దవాడు అమెరికాలో డాక్టర్! సంసారంతో ఆదేశంలోనే స్థిరపడ్డాడు. తోచినప్పుడల్లా ఇండియాకొచ్చి తండ్రిని చూచిపోతుంటాడు.

రెండవ వాడు హరి! చదువు పెద్దగా అబ్బక పోవటంతో... కొద్ది పాటి జీతం వచ్చే చిన్న వుద్యోగం చేస్తూ తండ్రి దగ్గరే వుంటున్నాడు.

మగ పిల్లలిద్దరికీ పదేళ్ల తేడా వుంది. వయసులో! చిన్నవాడు కావటాన తండ్రి దగ్గర కొంచెం గారాబం ఎక్కువ.

ఈ మధ్యనే హరికి కూడా వివాహం జరిగి భార్య కాపురానికొచ్చింది.

కోడలు కాపురానికొచ్చాక తెలిసింది... ఆమెగారు గయ్యాళి గంపని... మానవాకారంలో గల రాక్షసని!

అయినా... కోడలిమీద గౌరవాన్ని.... ప్రేమను అభిమానాన్ని పెంచుకున్నాడు సుందర్రామయ్య. అందుకు ముఖ్యమైన కారణం... ఆయన ఇంట ఆడపిల్లలు లేకపోవటమే.

కోడలిని కూతురుగానే భావిస్తూ మమతానురాగాలను పంచి ఇస్తున్నాడు.

'ఒరే హరీ.. కట్టుకున్న భార్యతో ప్రేమవూసులాడాలి తప్పించి... చిరాకు పడకూడదురా...'

కొత్త దంపతులు కయ్యానికి కాలుదువ్వుతూ... గొంతు చించుకోవటం గమనించి సుతి మెత్తని సలహా ఇచ్చాడు సుందర్రామయ్య.

చీటికి మాటికి కొడుకు కోడలు తగవులాడు కోవటం తనకూ ఇబ్బందిగా వుంది.

'నీ పెళ్లానికి..కొంచెం నోటి దురుసుతనం ఎక్కువ... పెద్దవాడిని... మామగారిననే గౌరవం లేకుండా... నోటికెంత మాటొస్తే అంతా మాట్లాడేస్తోంది.. కాస్తంతా నోరు సంబాళించుకోమని నువ్వే చెప్పు...' దిన పత్రిక తిరగేస్తూ హరితో అన్నాడు.

'నా మాట లక్ష్య పెట్టటంలేదు. నాన్నగారూ...'వాపోయాడు.

'కోడలి వ్యవహారం ఇప్పుడే ఇట్లావుంటే... ముందురోజులెలాగడుస్తాయో..'' పైకి విన్పించకుండా గొణిగాడు.

'నువ్వు చిన్న వుద్యోగం చేయటం నీ భార్యకి న్చలేదేమోరా హరీ! పోనీ... ఆ వుద్యోగాన్ని మానేసి... బిజినెస్ చేయరాదు.. ఎంత పెట్టుబడికావాలో చెప్తే ఇస్తాను...' కొడుకు ముఖంలోకి చూస్తూ మళ్లీతనే మాట్లాడాడు.

తండ్రి సలహా బాగా నచ్చింది హరికి!

'నేను మీతో మాట్లాడాలనుకుంటుండగా మీరే ఈ విషయం ప్రస్తావించారు..'

'ఏ బిజినెస్ చేయటానికి నిర్ణయించుకున్నావ్'

'అదేనండీ.... ఎలక్ట్రానిక్ గూడ్స్!... అంటే... టి.వి.లు... ఫ్రిజ్‌లు... టేప్‌రికార్డర్లు... వగైరా వగైరా... వ్యాపారం లాభసాటిగా వున్నదనిపిస్తోంది...'

'పెట్టుబడి ఎంత కావలసొస్తుంది...' తీక్షణంగ హరికళ్లలో దృష్టి నిలిపి అడిగేడు సుందర్రామయ్య.

'పదిలక్షలతో స్టార్ట్ చేస్తే... అవసరాన్నిబట్టి .... పెరిగే బిజినెస్‌నుపట్టి... బాంకు లోను తీసుకోవచ్చు...

'చేయగలననే ధైర్యం నీకుంటే... అలాగే చెయ్...' తన ఆశీస్సులు అందించాడు కొడుక్కి.

★★★★★

హరిది స్వతహాగా మెతక స్వభావం! అయితే... వ్యాపారానికి సంబంధించిన విషయాల్లో కరాఖండిగానే వుంటున్నాడు.

వ్యాపారం ప్రారంభించిన వేళా విశేషం బాగుండటంతో... ఏడాది కాలం తిరక్కుండానే మరో రెండు సెంటర్స్‌లో బ్రాంచీలు ప్రారంభించాడు. అందుక్కావలసిన వారినీ నియమించాడు.

బిజినెస్‌లో హరికి బొత్తిగా విశ్రాంతి కొరవడింది. వేళకి తిండి తిన్లేక పోతున్నాడు. రాత్రి పొద్దు పోయాక ఇంటికొస్తున్నాడు.

భర్తని తన కొంగున ముడేసుకోవాలనే కాంక్ష సౌమిత్రికి తీరటం లేదు. భర్త ఇల్లు చేరుకునే వేళకి తాను నిద్రపోతుంది. పగటిపూట అరగంటసేపైనా భర్త ఇంట్లో వుండక పోవటం.... తనను పట్టించుకోక పోవటం... వ్యాపారమైన డబ్బు... లావాదేవీల వ్యవహారమంతా భర్త మామగారితో సంప్రదించటం చూస్తున్న సౌమిత్రికి వళ్లు మండుతోంది.

భార్యనైన తనను లక్ష్యపెట్టటం లేదనే భావన ఆమెలో బలీయంగా నాటుకుంది. ఇంట్లో తన మాట చెల్లు బాటు కోసం అన్ని విషయాల్లో పెత్తనం చెలాయించాలనే ఆరాటం సౌమిత్రిని కలవరపాటుకు గురిచేస్తోంది. మనిషి కోపాన్ని క్రౌర్యాన్ని పెంచుకోసాగింది.

ప్రతి విషయంలోను సౌమిత్రి తల దూర్చటం అధిక ప్రసంగం చేయటం వంటి చేష్టలు చూస్తుంటే సుందర్రామయ్య మనసు అశాంతికి గురౌక తప్పటం లేదు. అయినా మనిషి తొణక్కుండా ఓర్పు వహిస్తూ వస్తున్నాడు.

మరో నాలుగు రోజుల్లో సంక్రాంతి పండుగ వస్తుందనగా.... ఇనప్పెట్టెలో గల భార్య బంగారు నగలు ఆభరణాలు తీసి సౌమిత్రిని పిల్చి పండుగకు సొమ్ములు పెట్టుకోమని చెప్పి వాటిని అందించాడు.

ఆదివారం కావటంతో భర్త ఇంటిపట్టునే వున్నందుకు సంతోషిస్తూ.... మామగారిచ్చిన నగలు అలంకరించుకుని... లక్ష్మీదేవిలా ముస్తాబై... హరి ముందుకొచ్చి నిలబడి 'ఒకసారి నా వేపు చూడండి.. నేనెలావున్నాను...' అడిగింది.

'గంగిరెద్దులా వున్నావ్...' చిరాకు పడ్డాడు హరి.

'ఏమిటా మాటలు?... సొమ్ములన్నీ పెట్టుకుని ముస్తాబై మొగుడి వద్దకొస్తే... ఎద్దులావున్నావ్.. కుక్కలావున్నావ్ అంటారేమిటి...; 'నొసలు చిట్లించి... కనురెప్పలు టపటపలాడిస్తూ దీర్ఘాలు తీసింది.

'దేవ కన్యాలా వున్నావ్... సరేనా!?... కాదు రంభలా వున్నావ్...'

'ఏంటీ?.. వెటకారమా? అసలు... ఏ టేస్టూలేని మిమ్మల్ని కట్టుకున్నందుకు... నా చెంపలు నేను వాయించుకోవాలి. .. మీకోవిషయం చెప్పనా... ఈ నగలు పండుగకు పెట్టుకోమని మామగారిచ్చారు.. కానీ...

'కానీలు అర్ధణాలు చెల్లిపోయి చాలాకాలమైంది..' విసుక్కున్నాడు.

'ఆపండి మీ బడాయి మాటలు! ఈ నగలు తిరిగి మామగారికి ఇవ్వబోవటం లేదు. ఎంచక్కా...నేనే వుంచేసుకుంటాను.. ' వగలు పోతూ అంది సౌమిత్రి.

ఇంటి పెత్తనం చేతికి రావాలన్నా... నగలు దిగేసుకుని స్వంతం చేసుకోవాలన్నా... ఈ ఇంటి పెద్దకోడలు అమెరికాలో వుంది. అన్నింటిలోనూ చెరి సగం వాటా వుంటుంది భార్యామణీ!... సో'

భర్త మాటలకు అడ్డొచ్చి 'సోలేదు..సింగినాదం లేదు. అయినా వాళ్లక్కడ కోట్లు

సంపాదిస్తున్నారు. ముష్టి వీటి కోసం ఆశపడరు.. తెలివిగా మాట్లాడాననుకుంది.

'నీ హద్దుల్లో నువ్వుండడం ఆరోగ్యానికి మంచిది! అండస్టాండ్...'

'స్టాండో... సిట్టో! - ఇక్కడి మన బుల్లి సామ్రాజ్యానికి నేనే రాణిని! సర్వహక్కులు నాకే! ఎక్కడో వున్నవాళ్ల గురించి ఆలోచించను...' టెక్కు పోయింది.

ఆ రోజు రాత్రి ఇంట్లో పెద్ద రభస జరిగింది! నగలు తనకు దక్కనీయని భర్త పట్ల దురుసుగా ప్రవర్తించింది. అరచుకున్నారు. కలియబడ్డారు. జుట్టు పట్టుకున్నారు. భర్త వంటిన చొక్కా కోపంతో చించింది. వళ్లంతా గోళ్లతో రక్కింది.

యుద్ధవాతావరణం నెలకొని వుండటం చూస్తూ అప్పటి వరకు మౌనంగా వున్న సుందర్రామయ్య ఇద్దరినీ విడదీయటానికి విఫల యత్నం చేసాడు.

సౌమిత్రి తన మీదకూడా తిరగబడింది!.. తిట్టింది...

కోడలి ప్రవర్తన జీర్ణించుకోలేక పోయిన సుందర్రామయ్య సౌమిత్రి ఆ చెంప ఈ చెంప వాయించాడు.

అందుకు సౌమిత్రి రెచ్చిపోయి... మామగారి ముఖాన వుమ్మేసింది. భర్తని కాలితో తన్నింది.

ఆవేశపడిపోతూ... పెట్టె సద్దుకుని సౌమిత్రి సిటీలోనే వున్న ఆమె పుట్టింటికి ఆటోలో వెళ్లిపోయింది.

ఆమెను అడ్డుకోలేక పోయిన తండ్రీ కొడుకులిద్దరూ శిలాప్రతిమలైనారు.

పుట్టింటికి చేరిన సౌమిత్రి... మామగారు తనను కొట్టారని... చంపటానికి ప్రయత్నించారని కోర్టులో కేసు వేసింది. కూతురి కాపురం విచ్ఛిన్నం కాకుండా చూడవలసిన సౌమిత్రి తండ్రి కూడా అగ్నికి ఆజ్యంతోడైన విధంగా... తన కూతురు తప్పిదం ఏ మాత్రం లేదని వత్తాసు పలికి వున్నవి లేనివి సృష్టించే విధంగా తమ తరఫులాయర్‌కు జరిగింది చెప్పి.. కేసు ఎట్లాగైనా తామే ఎట్టి పరిస్థితుల్లో గెలవాలని పట్టుబట్టాడు.

"మామగారు కోడలిపై చేయి చేసుకోవడమే పెద్ద అఫెన్సండీ.. ఇలాంటి కేసుల్లో అత్తమామలకు శిక్షపడిన సందర్భాలెన్నో వున్నాయ్.' అంటూ సౌమిత్రి తండ్రి గోవిందరావుతో అన్నాడు లాయర్ శతభిషం!

'పొగరుబోతు నా మామగారికి శిక్షపడితీరాల్సిందే! అంతవరకూ నా కంటికి నిద్ర కూడా పట్టదు. అత్తగారి సొమ్ము పెట్టుకున్నందుకు రాద్ధాంతం చేస్తాడా?... అదేమంటే.. నా మీదే ... తాళి కట్టిన భర్త ఎదుట... చేయి చేసుకుంటాడా? ఎంత దుర్మార్గం? ఎంత అమానుషం?- లాయరుగారూ... ఈ కేసుని ప్రిస్టేజీగా తీసుకొని మామగారికి శిక్ష పడేలా వాదించాలి... మేం గెలిచి తీరాలి.. ! కోపంతో వూగిపోతూ వుద్రేకపడుతూ సౌమిత్రి మాట్లాడింది.

శతభిషం లాయరు తన పలుకుబడిని ఉపయోగించి కేసు బెంచ్‌మీదికొచ్చేట్టు ప్రయత్నించాడు.

సుందర్రామయ్య వేపు లాయరు కూడా గట్టివాడే! ఏం భయం లేదంటూ కొండంత ధైర్యాన్ని నూరిపోశాడు.

నిజంగా ఎంత దౌర్భాగ్య స్థితి!! తనింట్లో... ఎందరివిషయాల్లోనో న్యాయమైన తీర్పు ఇవ్వగలిగిన తాను స్వంత విషయంలో ముద్దాయిగ.. తలొంచుకుని.. కోర్టులో నిలబడవలసి వచ్చింది. కోడలిని కొట్టిన తన తొందరపాటుకి తనను తాను నిందించుకున్నాడు. అవును తాను తప్పుచేశాడు. ఆడమనిషిపై చేయి చేసుకోవటం క్షమించరాని నేరమే అవుతుంది. తాను కోర్టు విధించే శిక్షకు పాత్రుడే. అనుకుని కుమిలిపోతున్నాడు సుందర్రామయ్య.

మరి కొద్ది రోజుల్లో తీర్పు వెలువడ బోతోంది. తనను దోషిగా కోర్టువారు నిర్ధారిస్తారా? లేక కేసు కొట్టివేస్తారా అనే ఆందోళన క్షణక్షణం తీవ్రమౌతోంది. సుందర్రామయ్యలో...

ఈ కేసులో ఇరు పక్షాల వాద ప్రతి వాదనలు విన్నతరువాత..ముద్దాయి సుందర్రామయ్య తన కోడలు సౌమిత్రిని తీవ్రంగ కొట్టి హింసించాడనే ఆరోపణ రుజువై నందున.. మహిళపై చేయిచేసుకోవటం..కొట్టటం... తీవ్రమైన నేరంగా కోర్టు పరిగణిస్తున్నది కనుక... సదరు ముద్దాయి సుందర్రామయ్యకు ఏడాది కాలం సాధారణ జైలు శిక్ష... అయిదువేల రూపాయలు జరిమానా విధించటమైనది.' అంటూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

తండ్రికి శిక్ష పడినందుకు హరి బావురుమన్నాడు.

కేసు గెల్చినందుకు సౌమిత్రి ఆమె తండ్రి గోవిందరావులు సంబరపడ్డారు.

ఇంత బతుకు బతికి ఇంటి వెనుక చచ్చి నట్టు... సింహంలాంటి సుందర్రామ్య... తన గౌరవమర్యాదలు గంగపాలైనందుకు... తనకు శిక్ష పడినందుకు... అవమాన భారంతో కృంగిపోయాడు.

బోనులో నిలబడి వున్న సుందర్రామయ్యలో రక్తపోటు అధికమైన కారణాన.. తీవ్ర గుండె పోటుకు దారితీయటంతో కోర్టు హాల్లో.. నిలుచున్న చోటే వున్నట్టుండి కుప్పకూలేడు... తుది శ్వాస విడిచాడు.

తన జీవితం ఇంత దయనీయంగా ముగుస్తుందని ఏనాడు వూహించని సుందర్రామయ్య క్షణాల్లో శవమైనాడు.

కన్నతండ్రి కోర్టు హాల్లోనే ప్రాణాలు విడిచినందుకు హరి భోరున ఏడుస్తూ స్పృహతప్పి పడిపోయాడు!

కోర్టు తీర్పు కంటే ముందే ఆ దేవుడి తుది తీర్పు నుండి తప్పించుకోలేక పోయాడు సుందర్రామయ్య!

-:(సమాప్తం):-